క్లుప్తంగా

నేడు పైడిచింతపాడులో జగనన్న సురక్ష

ఏలూరు రూరల్: ఏలూరు మండలం పైడిచింతపాడు బీసీ కమ్యునిటీహాల్లో బుధవారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు. డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి పరివేక్షణంలో అర్హులకు పలు ధ్రువ పత్రాలు అందజేయనున్నారు.

గిరిజన విద్యార్థి మృతిపై విచారణ చేయాలి

ఏలూరు (టూటౌన్): బుట్టాయగూడెం మండలం పులిరాముడు గూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న ఉర్రింక గ్రామం కొండరెడ్డి తెగకు చెందిన అఖిల్ వర్ధన్ రెడ్డి మృతిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు బి.నిర్మలా కిషోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరులోని బీజేపీ జిల్లా కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు హాస్టల్‌ను సందర్శించి విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించి వివరాలను తమ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. గతంలో ఇదే హాస్టల్ నుంచి బాలుడి అదృశ్యమై ఆచూకి దొరకని పరిస్థితి అని, నేడు ఈ హత్య జరగడం బాధాకరమని పేర్కొన్నారు. గత ఐదు నెలలుగా హాస్టల్‌లో వార్డెన్ లేకపోవడం, నైట్ వాచ్‌మెన్ డ్యూటీకి రాకపోయినా పట్టించుకునే వారు లేకపోవడంతో ఇటువంటి ఘటనలకు ఆస్కారం ఇస్తోందని వివరించారు. బాధిత కుటుంబానికి ఐటీడీఏ తక్షణం నష్టపరిహారం ప్రకటించాలని, వారికి న్యాయం చేయాలని బీజేపీ మహిళా మోర్చా తరుపున డిమాండ్ చేశారు.

కోళ్ల వ్యర్థాలను వ్యాన్‌లో తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

భీమడోలు: కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న ఓ మినీ వ్యాన్, ఇద్దరు వ్యక్తులను మంగళవారం భీమడోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మినీ వ్యాన్‌లో డ్రమ్ముల్లో తరలిస్తున్న 1,500 కేజీల కోళ్ల వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే... పెదపాడు మండలం గుడిపాడుకు చెందిన జయమంగళ అనంద్‌కుమార్ ఖమ్మంలోని వివిధ చికెన్ దుకాణాల వద్ద నుంచి సుమారు 1,500 కేజీల కోడి వ్యర్థాలను సేకరించి వాటిని డ్రమ్ముల్లో ఉంచి మినీ వ్యాన్‌లో తరలిస్తున్నాడు. వాటిని కురెళ్లగూడెం పరిసర ప్రాంతాల్లో సాగు చేస్తున్న ఆక్వా చెరువులకు మేత నిమిత్తం తరలిస్తుండగా భీమడోలు హెచ్‌సీ శ్రీనివాసరావు భీమడోలు రైల్వే గేటు వద్ద తనిఖీల్లో పట్టుకున్నారు. మినీ వ్యాన్ డ్రైవర్‌తో పాటు యాజమానిలిద్దరిని అరెస్ట్ చేసారు. మినీ వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

భీమడోలు: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన అందిస్తోందని భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. గుండుగొలను పంచాయతీ శివారు భోగాపురం వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ కనమాల రామయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలనను అందిస్తున్నారన్నారు. పథకాలను ప్రజల చెంతకు తీసుకెళుతున్న వలంటీర్లపై పవన్ కల్యాణ్ విషం కక్కుతున్నాడని అన్నారు. అనంతరం 253 మంది ఉచితంగా ధ్రువీకరణ పత్రాలను అందించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి పి.విజయరాజు, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఎంపీటీసీ సత్తా నాగిని, నాయకులు వగ్వాల అచ్యుతరామారావు, నల్ల శ్రీనివాసరావు, పందుల మణెమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యానికి బాటలు

- వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు మేలు
- కరోనా కష్టకాలంలో విశేష సేవలు

ఏలూరు టౌన్: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కారు వేసిన తొలి అడుగు వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు. వైఎస్ జగన్ అధికారం చేపట్టి సరికొత్త పంథాకు శ్రీకారం చుట్టారు. ప్రజలే ప్రభువులు అనే నినాదంతో ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన చేరువ చేసి తన దార్శనికతను చాటుకున్నారు. దేశానికే ఆదర్శవంతమైన రీతిలో ఏపీలో వలంటీర్ వ్యవస్థ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తోందనటంలో సందేహం లేదనే చెప్పాలి. ప్రపంచ వ్యాప్తంగా కరోనా విలయతాండవం చేసే సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వలంటీర్లు ప్రజలకు సేవలు అందించారు. ఏలూరు నియోజకవర్గంలో 1,495, ఏలూరు అర్బన్ పరిధిలో 1,018, రూరల్ పరిధిలో 477 వలంటీర్లు ఉన్నారు. ఏలూరు నగరంలో 62, రూరల్ పరిధిలోని 17 సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయం పరిధిలో సగటున 16 నుంచి 20 మంది వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. వలంటీర్ల సేవలను అభినందిస్తూ ఏలూరు నగరంలో మహిళలు తమ అభిప్రాయాలు వారి మాటల్లోనే..





పథకాల పంపిణీలో వలంటీర్ సేవలు (ఫైల్), నీలపు లక్ష్మికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఎం.కల్పన

ఏ అవసరం వచ్చినా వలంటీరే



ఏలూరు 47వ డివిజన్‌లో నివాసం ఉంటున్నాం. మాకు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పెన్షన్, ఆసరా, సున్నా వడ్డీ ఇలా ప్రభుత్వ పథకాలు అన్నీ ఇంటివద్దకే వస్తున్నాయి. మాకు ప్రభుత్వ పరంగా ఏ చిన్న అవసరం వచ్చినా వలంటీర్ మజ్జి హరిణి వెంటనే స్పందించి ఇంటికి వచ్చి, సమస్యను పరిష్కరిస్తోంది. కరోనా సమయంలో వలంటీర్ల సేవలు చాలా బాగున్నాయి. కుటుంబ సభ్యుల్లా ఎంతో సేవ చేశారు. కుల, ఆదాయ ధ్రువ పత్రాలు వలంటీరే దరఖాస్తు చేయించి, మళ్లీ సర్టిఫికెట్లు ఇంటికే తెచ్చి ఇచ్చింది. వలంటీర్ల వల్లనే మాకు ప్రభుత్వ సేవలన్నీ సక్రమంగా అందుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వలంటీర్లను ఏర్పాటు చేయటం సంతోషంగా ఉంది. – తాడి నిర్మలకుమారి, 47వ డివిజన్, ఏలూరు

పథకాలు నేరుగా అందుతున్నాయి



నేను రాణీనగర్ 9వ రోడ్డులో నివాసం ఉంటున్నాం. మా వలంటీర్ కుమారి మా కుటుంబాలకు ప్రభుత్వ పథకాలన్నీ అందేలా శ్రద్ధ తీసుకుంటుంది. కరోనా కష్టకాలంలోనూ మాకు అండగా ఉన్నారు. ఏళ్ల తరబడి సొంత ఇల్లు లేక మేము చాలా ఇబ్బందులు పడుతున్నాం. రూపాయి ఖర్చు లేకుండా టిడ్కో ఇల్లు మంజూరయ్యింది. వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ పథకాలన్నీ సక్రమంగా మాకు అందుతున్నాయంటే వలంటీర్ వల్లనే. మాలాంటి పేదలకు వలంటీర్ వ్యవస్థ ఎంతో ఉపయోకరంగా ఉంటుంది.– ఆర్.నారాయణమ్మ, రాణీనగర్, తంగెళ్లమూడి

సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు ఏలూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన 36 గంటల ధర్నా మంగళవారం ముగిసింది. ధర్నాలో భాగంగా రాత్రికి అక్కడే నిద్రించిన అంగన్‌వాడీలు ఉదయం కలెక్టరేట్ వద్ద బైఠాయించారు. డీఆర్‌ఓ సత్యనారాయణమూర్తి వారి వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. ఆందోళనకు ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మద్దతు ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ధర్నాలో అంగన్‌వాడీల యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి, మద్దతుగా సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

భగ్గుమన్న వలంటీర్లు



ఏలూరు 12 పంపుల సెంటర్లో రాస్తారోకో చేస్తున్న వలంటీర్లు



తంగెళ్లమూడి వంతెన వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న వలంటీర్లు

ఏలూరు (టూటౌన్): వలంటీర్లపై ఏలూరు బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్, కొత్తపేట 12 పంపుల సెంటర్లో వలంటీర్లు ఆందోళన చేశారు. ఫైర్ స్టేషన్ సెంటర్లో 15వ డివిజన్‌లోని వెంకటాపురం 6వ, గాంధీకాలని 41, జేపీ కాలనీ 50వ వార్డు సచివాలయాలకు చెందిన వలంటీర్లు ఆందోళన చేశారు. పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పవన్ తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. 35వ డివిజన్ కొత్తపేట 12 పంపుల సెంటర్లో వలంటీర్లు రాస్తారోకో నిర్వహించారు. పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినదించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందిస్తున్న వలంటీర్ల కారణంగానే మహిళలు మిస్ అవుతున్నారంటూ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని పేర్కొన్నారు. తక్షణం వలంటీర్లకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో వలంటీర్లు పులి ఉష, కె.మహాలక్ష్మి, ఎల్ సౌజన్య, ఎ.మురళి, జి.నాగశ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో, ఫైర్ స్టేషన్ సెంటర్లో దిష్టిబొమ్మ దహనం

పవన్ క్షమాపణ చెప్పాలి

ఏలూరు టౌన్: ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో నిస్వార్థంగా సేవలు అందిస్తోన్న వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటనీ, వెంటనే క్షమాపణలు చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. ఏలూరు తంగెళ్ళమూడి వంతెన సమీపంలో మంగళవారం వలంటీర్లు పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినదిస్తూ నిరసన ప్రదర్శన చేశారు. సత్ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థలను అమల్లోకి తెచ్చారని, వలంటీర్లు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువచేస్తూ సేవలు అందిస్తున్నారని వివరించారు. పవన్ కళ్యాణ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, రాష్ట్రంలోని 2.50లక్షల మంది వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

దళితుల మనోభావాలను దెబ్బతీసిన జనసేన



జాన్ గురునాథ్

ఏలూరు టౌన్: పవన్ కళ్యాణ్ ఏలూరు పాతబస్టాండ్ సభ నేపథ్యంలో రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ అంబేడ్కర్‌ను దారుణంగా అవమానపరిచారని, జనసేన కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహాన్ని ఎక్కి వీరంగం చేయటం హేయమైన చర్యగా ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్ చెప్పారు. పవన్ కళ్యాణ్ పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి కనీసం పూలమాలలు వేసి నివాళులర్పించలేదని, రాజ్యాంగ నిర్మాతకిచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. దళిత వర్గాల పట్ల పవన్‌కళ్యాణ్‌కు చిత్తశుద్ధి లేదని స్పష్టమైందన్నారు. దళితుల మనోభావాలు దెబ్బతినేలా జనసేన కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహాన్ని కాళ్లతో తొక్కుతూ వీరంగం చేస్తుంటే ఏం చేస్తున్నారంటూ పవన్ కళ్యాణ్‌ను నిలదీశారు. అంబేడ్కర్ సాక్షిగా అంటూ ప్రసంగాలు చెప్పటం కాదని, కనీసం నివాళులర్పించాలనే ఇంగిత జ్ఞానం లేని పవన్‌కళ్యాణ్‌ను దళిత ద్రోహిగా ప్రజలు భావించాల్సి వస్తుందని చెప్పారు. జనసేన కార్యకర్తలు మద్యం మత్తులో అంబేడ్కర్ విగ్రహాన్ని అపవిత్రం చేశారని, దీనిపై పవన్ కళ్యాణ్ స్పందించాలని, లేకుంటే యాత్రను అడుగడుగునా అడ్డుకుంటామని గురునాథ్ హెచ్చరించారు. రాష్ట్రంలో దళితుల పక్షపాతిగా, వారి అభ్యున్నతికి పాటుపడేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే అని వివరించారు. దళితులంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెంటే ఉన్నారని, రాబోయే 2024 ఎన్నికల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటారని చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆళ్ల నానికి దళితులంతా మద్దతు ఇస్తూ.. వారి గెలుపుకు నిత్యం అండగా ఉంటున్నారని తెలిపారు.

ఆయిల్‌పామ్ గెలలు టన్నుకు రూ.18 వేలు ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): ఆయిల్‌పామ్ గెలలు టన్నుకు రూ.18వేలు ధర ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహా ఆధ్వర్యంలో మంగళవారం రైతు సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ గతేడాది ఆయిల్ పామ్ టన్ను గెలలకు ఉన్న రూ.23 వేలు ధర రూ.13వేలకు పడిపోయిందన్నారు. కౌలు రేట్లు, ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయిన నేపథ్యంలో ఆయిల్ పామ్ టన్ను గెలలకు కనీస మద్దతు ధర రూ.18 వేలు ఇవ్వాలని కోరారు. సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి, శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కృష్ణా, గోదావరి డెల్టాల పరిధిలో ఆయకట్టు భూములకు ఖరీఫ్ సాగుకు సక్రమంగా సాగునీరు అందించకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో గంటా పాపారావు, గండి రాజా, రైతులు పాల్గొన్నారు.

శ్రేయస్సు కోసమే కుటుంబ నియంత్రణ

పెదవేగి : కుటుంబ సంతోషం, శ్రేయస్సు కోసం కుటుంబ నియంత్రణ పాటించాలని పెదవేగి ప్రాథమిక వైద్యశాల డాక్టర్ మాదవి చెప్పారు. మంగళవారం పెదవేగి పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో స్వాతంత్ర్య అమృత మహోత్సవం సందర్భంగా కుటుంబ సంతోషం, శ్రేయస్సు కోసం కుటుంబ నియంత్రణ పద్దతులను పాటిద్దామని ఆరోగ్య సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

జనాభా పెరుగుదలతో వనరుల కొరత

ఉంగుటూరు: జనాభా పెరుగుదలతో వనరుల కొరత ఏర్పడుతుందని ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారి 2 కె. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్లో జనాభా దినోత్సవం నిర్వహించారు.

మొక్కలు నాటిన వైద్యాధికారులు

దెందులూరు: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పోతునూరు పీహెచ్‌సీలో సర్పంచ్ బోదుల స్వరూప్ మొక్కలు నాటారు. వైద్యులు ప్రవీణ్‌కుమార్,సీహెచ్‌ఓ కే.అలివేలు, ఎంపీహెచ్‌ఈఓ పీ.శ్రీనిబాబు పాల్గొన్నారు.

జనాభా పెరుగుదల దేశ ప్రగతికి నిరోధకం

భీమడోలు: జనాభా పెరుగుదల దేశ ప్రగతికి అవరోధమంటూ గుండుగొలను, పూళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.శ్రీలక్ష్మీ, బి.లీలా ప్రసాద్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గుండుగొలను, పూళ్ల పీహెచ్‌సీల పరిధిలో అవగాహన ర్యాలీ, ప్రదర్శన చేసారు.

విలీన గ్రామాల్లో మౌలిక వసతులు భేష్

- రూ.96 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- ప్రజల హర్షం

ఏలూరు రూరల్: ఏలూరు కార్పొరేషన్ విలీన గ్రామాలు వెంకటాపురం, చొదిమెళ్ల, శనివారపుపేట, సత్రంపాడు, పోణంగి, కొమడవోలు, తంగెళ్లమూడి అభివృద్ధి బాట పట్టాయి. ఏడాది క్రితం రూ.96 కోట్లతో అధికారులు చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తయింది. మారుమూల ప్రాంతాలు, పేదల నివసించే ఇందిరమ్మ కాలనీల్లో సైతం పక్కా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుచేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో అభివృద్ధి ప్రారంభమయింది. గ్రామాల్లో మొత్తంగా 285 పనులు చేపట్టి 97 కిలో మీటర్ల విస్తీర్ణంలో సీసీ రోడ్లు నిర్మించారు. ఇందుకోసం రూ.51 కోట్లు ఖర్చు చేశారు. మరో 156 పనులతో 120 కిలోమీటర్ల డ్రెయినేజీ వ్యవస్తను అభివృద్ధి చేశారు. ఇందుకు మరో రూ.45 కోట్లు ఖర్చు చేశారు.

నిరంతరాయంగా పనులు

ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు అధికారులు అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగించారు. గ్రామాన్ని ఒక సెక్టార్‌గా తీసుకుని చిప్స్, ఇసుక, సిమెంట్ డంప్ చేశారు. పనులు చేపట్టి చకాచకా పూర్తి చేశారు. తర్వాత మరో ప్రాంతానికి సిబ్బంది, మెటీరియల్ తరలించి కొనసాగించారు. వైఎస్సార్ కాలనీలో పెద్ద ఎత్తున సీసీరోడ్లు నిర్మించారు. డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటుచేశారు. కొత్తూరు ఇందిరమ్మకాలనీ ఫేస్–1, ఫేస్–2లో మొత్తంగా 100 శాతం సీసీరోడ్లు, డ్రెయినేజీ పూర్తి చేశారు. గవరవరం చెరువు గట్టు పరిసరాల్లో సుమారు 1000 మీటర్ల భారీ డ్రెయిన్ నిర్మించారు. కొమడవోలు ఇందిరమ్మకాలనీలో సుమారు 15 కిలో మీటర్ల మేరకు సీసీరోడ్లు నిర్మించారు. చొదిమెళ్ల ప్రధానరోడ్డు విస్తరించి రెండు పక్కలా డ్రెయిన్లు అభివృద్ధి చేశారు. గ్రామ చెరువు నుంచి శివారు వరకు సీసీ, బీటీరోడ్డు అభివృద్ధి చేయడంతో వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పోణంగిలో నిర్మించిన రోడ్డు



చొదిమెళ్లలో నిర్మించిన సీసీరోడ్లు, డ్రెయినేజీ



కొత్తూరుకాలనీలో నిర్మించిన డ్రెయినేజీ

అభివృద్ధి బాగుంది



గత ప్రభుత్వ హయాంలో ప్రజలు గోతులు రోడ్లు, కచ్చా డ్రెయినేజీ వ్యవస్థతో అవస్థలు పడ్డారు. నేడు వైఎస్సార్‌సీపీ హయాంలో ఆళ్ల నాని పర్యవేక్షణలో అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహించాం. ప్రతి ఇంటి ముందు సీసీ రోడ్డు, విలీన గ్రామంలో 100 శాతం డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుచేశాం. – మంచెం మైబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్

సంతోషంగా ఉంది



వెంకటాపురం 15 డివిజన్‌లో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే ఆళ్ల నానికి 15 డివిజన్ ప్రజలు కృతజ్ఞతులు చెబుతున్నారు. ఎన్నడూ లేని విధంగా మారుమూల వీధిల్లో సైతం సీసీరోడ్డు నిర్మించారు. పక్కా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పడింది. – తంగెళ్ల రాము, 15 డివిజన్ కార్పొరేటర్

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	34
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	12

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	29
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	20

సచివాలయ భవనం, సీసీ రోడ్డు ప్రారంభం



పెరుగ్గూడెంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దెందులూరు: దెందులూరు నియోజకవర్గాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం రాత్రి పెరుగ్గూడెంలో పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ యలమర్తి రేవతి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమర్తి రామకృష్ణ, సత్తిబాబు, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), ఎంపీటీసీ యలమర్తి బాపూజీల ఆధ్వర్యంలో రూ. 40 లక్షలతో సచివాలయ భవనం ప్రారంభోత్సవం, రూ. 27 లక్షలతో నిర్మించిన డ్రెయిన్, రూ. 8 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామ సచివాలయం వద్ద బహిరంగ సభలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. వలంటీర్లను సైతం కించపరిచేలా ఇతర పార్టీల నాయకులు విమర్శించడం సిగ్గు చేటన్నారు. పెరుగ్గూడెంలో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. 138 మందికి ఇళ్ల స్థలాలు పెరుగ్గూడెంలో ఇచ్చామని తెలిపారు. త్వరలోనే మరో 25 మందికి ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ నవరత్న పథకాలతో పాటు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని అన్నారు. నియోజవకర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉంటామన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాద్‌రావు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టుబోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, వైస్ ఎంపీపీలు వేమూరి జితేంద్ర, గొల్ల నాగరాజు, సొసైటీ చైర్మన్లు కొలుసు గణపతిరావు, కొమ్మిన రాము, అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ శ్రేణులు ఉన్నారు. సచివాలయానికి స్థలదానం చేసిన యలమర్తి సోమయ్య, సత్తెమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, వీరరాఘవులు, రాంబాబులను సచివాలయ కాంట్రాక్టర్ కామిరెడ్డి బాలును ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సత్కరించి జ్ఞాపికను అందజేశారు.